# టెన్షన్

పాలగిరి వేణు

హైదరాబాద్‌లో దిగి.. 'హోటల్ ఆశ్రమ్'లో రూం తీసుకుంటూనే నేను చేసే మొట్టమొదటి పని శంకర్రావుకు ఫోన్ కొట్టడం.

శంకర్రావు నాకున్న కొద్దిపాటి స్నేహితుల్లో ముఖ్యుడు. ఓ కెమికల్ కంపెనీలో పర్చేజ్ ఎక్స్‌క్యూటివ్.. సరదాగా వుంటాడు. శంకర్రావే ఫోన్ అందుకున్నాడు. ఆఫీసు అవంగానే రూంకు వచ్చేస్తానన్నాడు.

ఏడుగంటలు బస్సు ప్రయాణం చేయడంవల్ల వ ళ్ళంతా నలతగా వుంది.. అలసటగా వుంది. వేణ్ణీళ్ళతో 'షవర్‌బాత్' చేశాక కొంత 'ఫ్రెష్' అయ్యాను.

అప్పుడు సాయంకాలం ఆరు అయింది. వాతావరణం చల్లబడి హాయిగా వుంది.

శంకర్రావు వచ్చాడు. లైట్‌గా టిఫెన్లు ముగించాం. బాతాఖానీ లో పడ్డాం. టి.వి 'ఆన్' చేస్తే ఏదో ఇంగ్లీషు పిక్చర్ వస్తోంది.

"బీర్ తెప్పించమంటావా?"

"వద్దు బీర్ అలర్జి.. ఏదైనా హాట్‌ట్ తెప్పించు."

ఒకప్పుడు రెండు గ్లాసుల బీరుకే శంకర్రావు కూలబడేవాడు. ప్రస్తుతం చాలా ఛాలా ఎదిగిపోయాడు.

బాయ్ వచ్చాడు. హాఫ్ ఓల్డ్ మాంక్ రమ్.. ఓ పావుకెజి దాల్‌మోట్‌ను తెమ్మని తానే డబ్బులిచ్చాడు శంకర్రావు.

మా కుటుంబ పరిస్థితులు.. ఆఫీసు వాతావరణాలు.. రాజకీయ పరిణామాలు చర్చించుకున్నాం.

బాయ్ రమ్ముతో పాటు 'ఐస్' కూడా తెచ్చాడు

మందు కార్యక్రమం ముగిసేసరికి రాత్రి తొమ్మిది అయింది. భోజనాలు రూంలోనే ఏర్పాటు చేయించా ను.

"మరినేవెళ్తా!..."

"టైము తొమ్మిదేగా?"

"నే వెళ్ళాలి.. అర్జంటు పనుంది.. రేపు డిన్నర్‌కు రాకూడదూ..."

"ఇంకోసారి చూద్దాంగానీ...! రేపు నీ ప్రోగ్రాం..."

"రేపు కూడా.. ఈ రోజులాగానే..! అయినా ఎన్ని రోజులుంటావేంటి?"

"రెండు రోజులు.. శుక్రవారానికల్లా నేవచ్చిన పని అయిపోవాలి.."

"గుడ్‌నైట్.." అంటూ లేచాడు శంకర్రావు..

గది తలుపు వరకువెళ్ళి సాగనంపాను.. శంకర్రావు లిఫ్ట్‌వైపు నడిచాడు. మనిషిలో 'మత్తు' ఎలాంటి మార్పు కలగనీయలేదు.. తలుపు 'లాక్' చేసుకున్నాను

తలంతా దిమ్ముగా వుంది.. నాకు హాట్‌డ్రింక్స్ పుచ్చుకునే అలవాటు తక్కువ. కంపెనీ కోసం ఏదో తీర్థంలా పుచ్చుకున్నానంతే!..

బెల్ మోగింది. 'ఐస్‌బాక్స్' కోసం బాయ్ వచ్చాడేమోనని తలుపు తీసి చూసాను. ఎదురుగా శంకర్రావు..

"రెండురోజులుంటున్నావుగా?"

"అవును.. ఏం"

"ఏం లేదు.. నాకు ఓ 'ఫైవ్ హండ్రెడ్ కావాలి.. ఎల్లుండి ఉదయం కల్లా తెచ్చిస్తాను."

ఎందుకని నేను అడగలేదు. అందుకని శంకర్రావు కూడా చెప్పలేదు.

"ఎల్లుండి కల్లా తెచ్చిస్తావుగా.. హోటల్ 'చెక్‌అవుట్'తో ప్రాబ్లం వుండకూడదు మరి..!"

శంకర్రావు తలూపాడు. సూట్‌కేస్‌లోంచి ఐదువం దల రూపాయలనోట్లు సరికొత్తవి అందించాను. శంకర్రావు మరోసారి 'గుడ్‌నైట్' అంటూ వెళ్ళిపోయాడు.

టి.వీలో హిందీ 'ఖెదీ' వస్తోంది. ఫ్యాను గాలి పెంచి అలా పడకమీద విశ్రమించాను. మరో రెండు నిముషాల్లో నిద్రతో కళ్ళు మూసుకుపోయాయి.

ఉదయం లేచేసరికి ఎనిమిది అయింది..

మా లైసన్ ఆఫీసుకెళ్ళే సరికి పది అయింది.

నేను నాతో తెచ్చిన "సేల్స్ స్టేట్‌మెంట్స్"ను అందచేసి వాటిని 'రికన్సైల్' చేసేందుకు సత్యమూర్తితో కూచున్నాను. ఆ రోజంతా అలాగే గడిచిపోయింది.

రూం కెళ్ళేసరికి ఆరుగంటలు దాటాయి. అప్పటికే శంకర్రావు రూమ్‌లో వున్నాడు.

"షాపింగ్ చేయాలి.. అలావెళ్తాంపద.. అంటూ శంకర్రావును తీసుకుని బయటకు వచ్చాం.. 'అబిడ్స్' కెళ్ళాం. మా ఆవిడిచ్చిన 'లిస్ట్' ఓ నాల్గొందలతో పూర్తయ్యేసరికి యింకో రెండుగంటలు దాటాయి.

దారిలోనే హాఫ్ మెక్డోవెల్ విస్కీ.. రెండు చిప్స్ ప్యాకెట్లు కొన్నాడు శంకర్రావు.

'రూమ్'లో మళ్ళీ మందు. బాయ్‌తో రెండు చికెన్ పలావు తెప్పించాను...

"ఎల్లుండేగా ప్రయాణం.."

"కాదు రేపు ఈవెనింగ్ బస్‌కు..."

"రేపు మళ్ళీ వచ్చి కలుస్తాను. గుడ్‌నైట్.." అంటూ శంకర్రావు సెలవు తీసుకున్నాడు. ఎందుకనో 'డబ్బు సంగతి హెచ్చరించలేకపోయాను.

నాది మళ్ళీ మత్తునిద్రే

ఉదయం కొంత ముందుగానే ఆఫీసుకెళ్ళాను. అప్పటికే సత్యమూర్తి వచ్చాడు. మళ్ళీ సేల్స్ స్టేట్‌మెంట్స్ పూర్తిగా చెక్ చేసాం.. 'రికన్సిలియేషన్' పూర్తయింది. నేను వచ్చిన పని అయిపోయింది.

నాల్గుగంటలకే రూం కెళ్ళాను. నిద్ర పట్టేసింది. లేచేసరికి ఆరుగంటలు దాటింది. స్నానం చేసి శంకర్రావు గురించి కాచుకున్నాను. ఈరోజు మందు కార్యక్రమం రద్దు చేసుకోవాలి.. శంకర్రావు వస్తూనే భోజనాలు చేసి 'లేట్‌షో' కేదైనా వెళ్ళాలి

తొమ్మిదివరకు చూశాను. శంకర్రావురాలేదు. 'అమరావతి'లో "ది బర్నింగ్ ట్రైన్" ఆడుతోంది ఉస్సూరుమంటూ వెళ్ళాను ఒంటరిగా.. ఆ రాత్రి అలా గడిచిపోయింది.

ఉదయం బాగా ఆలస్యంగా లేచాను.. తాపీగా అన్ని కార్యక్రమాలు ముగించాను. ఆఫీసు పని షాపింగ్ అయి పోయాయి. ఇక చేసేదేమిలేదు. సాయంకాలం ఆరుగంటల బస్సుకు ప్రయాణం. బస్ స్టేషన్‌కెళ్ళి టికెట్టు రిజర్వు చేయించుకుంటే కొంత రిలీఫ్'.. గౌలీగూడా కెళ్ళి బస్సుటికెట్టు రిజర్వు చేయించాను. కోటీలో మా పెద్దోడికి ఇంగ్లీషు—హిందీ డిక్షనరీ కొన్నాను. మళ్ళీ 'రూం' చేరుకున్నాను.

శంకర్రావుకు ఫోన్ చేశాను. ఏదో ఆఫీసు పనిమీద సికిందరాబాద్ కెళ్ళాడని ఎప్పుడొచ్చేది తెలియదని చెప్పారు ఆ ఆఫీసువాళ్ళు. శంకర్రావు వస్తూనే హోటల్ ఫోన్ నెంబరు వగైరాలు యిచ్చి ఫోన్ చేయమన్నాను. పర్సు తీసి చూసాను. సరిగ్గా మూడువందలున్నాయి

సాయంకాలం ఐదుగంటలకల్లా రూం బిల్ 'పే' చేసి 'చెక్‌అవుట్' కావాలి? శంకర్రావు వచ్చి డబ్బు ఇస్తేకానీ...?

మళ్ళీ ఇంకోగంట ఆగాక ఫోన్ చేశాను. శంకర్రావు యింకా రాలేదన్నారు. ఎక్కడికి వెళ్ళాడో? ఏమిటో? ఎప్పుడొస్తాడో?

భోజనం తెప్పించుకున్నాను. పూర్తిగా వదుంవాల్చాను. అంతా కలతనిదురే? డోర్ బెల్ మోగినట్లు ఫోన్ రింగయినట్లు భావించాను.

శంకర్రావు నుండి ఎలాటి ఫోన్ కాల్స్ రాలేదు. మళ్ళీ ఫోన్ చేసాను. శంకర్రావు ఆచూకీ తెలియదన్నారు. శంకర్రావు రాకపోతే! తీసుకున్న డబ్బు ఇవ్వకపోతే?? ఎలా? పరిస్థితి ఊహించుకోలేక పోతున్నాను.


మా "లైసన్ ఆఫీసు'కు వెళ్ళి అడ్వాన్సు తెచ్చుకుంటే? ఇప్పటికే తీసుకున్న అడ్వాన్సు 'సెటిల్"

**శంకర్రావు ఎందుకిలా చేశాడు... డబ్బు ఇచ్చేటప్పుడే చెప్పాను నేను ఈ రోజు సాయంకాలానికే వెళ్తున్నాని... డబ్బుల్లేకపోతే రూం 'వెకేట్' చేయటంలో ఇబ్బంది అని... తెల్సికూడ శంకర్రావు కనుమరుగవుతున్నాడంటే?**

కాలేదు.లు మరి ఇంకోసారి అడిగితే బావుంటుందా? ఇదో మీమాంసలో పడిపోయాను. ఏదిఏమైనా ఓ రెండుగంటల్లో ఐదువందలు సంపాదించాలి. లాడ్జింగ్‌కు రెండొందల యాభై.. బోర్డింగ్ ఖర్చులు ఓ వందా.. బేరర్లకు, బాయ్‌లకు 'టిప్పు' క్రింద ఓ పది. ప్రయాణపు ఖర్చులకై ఓ యాభై తప్పదు. ఆఫీసుకు ఫోన్ చేశాను. 'ఇంప్రెస్ట్' లో వందకన్నా ఎక్కువలేదని ఓ అరగంట క్రితమే 'పెట్రోలు బిల్స్' చెల్లించామని చెప్పారు.

ఇప్పుడెలా?

శంకర్రావు ఎందుకిలా చేశాడు. డబ్బు ఇచ్చేటప్పుడే చెప్పాను. నేను ఈ రోజు సాయంకాలానికి వెళ్తున్నానని డబ్బుల్లేకపోతే రూం 'వెకేట్' చేయడంతో ఇబ్బంది అని. తెల్సి కూడా శంకర్రావు కనుమరుగవుతున్నాడంటే?




శంకర్రావు ఆర్థికంగా ఏమైనా దెబ్బతిన్నాడా. మందుపుచ్చుకోవటమే కాకుండా యితర్రా వ్య సనాలేమైనా చుట్టుకున్నాయా?

మొన్నరాత్రి శంకర్రావు జేబులో 'రేస్‌బుక్' వుంది. అంటే అశ్వమేధయాగంలో సమిధ అయ్యాడా? ఏంటో ఒక పట్టాన అర్థంకావడంలేదు.

శంకర్రావుమీద ఎన్నో దుశ్శంకలు బయల్దేరాయి. కోపం ముంచుకువస్తోంది.

నాలుగు దాటిపోయింది. డైరీ తెరిచాను. లక్ష్మణరావుకు ఫోన్ చేసాను. ఊళ్ళో లేడట. సుబ్బారావు తనదగ్గర డబ్బులేదని క్షమించ మన్నాడు. సీతాపతి దొరికాడేకాని అతడితో డబ్బు గురించి చెప్పలేకపోయాను.

మొహమాటం ముంచేసింది. సీతాపతి ఆఫీసు అయ్యాక హోటల్‌కు వచ్చి కలుస్తానన్నాడు. వీడో 'ప్యారసైట్' వీడికి టిఫెన్లు.. కాపీలు ఇదో అదనపు ఖర్చు.. పైగా మందు కావాలంటాడు. ఒక్క పైసా కూడా విదల్చడు.. అందుకని వాణ్ణి దూరంగా వుంచేశాం.... నా రాకపోకలు. తెలుపకుండా?

ఇక మిగిలింది కృష్ణారావు... మా బంధువు... పెద్దన్నయ్యగారి అల్లుడు ఎలక్ట్రిసిటీ బోర్డులో జూనియర్ ఇంజనీర్.. మంచి కలుపుగోలు మనిషి. ఎన్నోసార్లు యింటికి రమ్మని ఆహ్వానించాడేగాని ఏ రెండుసార్లో వెళ్ళుండచ్చు... వెళ్ళాలంటే కొంత మొహమాటం కూడా వుంది. కృష్ణారావు చెల్లెల్ని నాకు యిద్దామనుకున్నారుకాని ఎందుకనో అది కుదర్లేదు. ఏమిటేమిటో ఆలోచిస్తున్నాను... అవసరాన్ని ఆదుకోలేని ఆలోచనలు..

ఫోన్ మోగింది.. అమ్మయ్య! శంకర్రావు నుండే అయ్యుండాలి..! దులిపేయాలి వెధవను...

ఫోన్ ఎత్తాను.. మా లైజన్ ఆఫీసు' నుండి వచ్చింది. "లెటర్ ఆఫ్ క్రెడిట్ గురించి సంబంధించిన పేపర్లట.. అవి మా ఆఫీసులో అంటే మా ఊళ్లో అందచేసి ఫైనాన్స్ మానేజర్‌గారి సంతకాలు చేయించి, రేపే పంపే ఏర్పాట్లు చేయాలట. "స్పెషల్ కొరియర్" ద్వారా పంపుదామనుకున్నారట. ఎలగూ నేను ఈవేళే వెళ్తాన్నానని నాతో ఈ అర్జంటు పేపర్లు పంపుతున్నారట. మెసెంజర్ ద్వారా హోటల్ రూమ్‌కు పంపుతామని, తీసుకోమన్నారు మా లైజన్ ఆఫీసరు.

నేను "ఊ" కొట్టాను. ఆ పేపర్లు పంపటంలో ఏ ఒక్కరోజు ఆలస్యమయినా కొన్ని వేలరూపాయలు 'పెనాల్టీ' కింద చెల్లించవలసి వస్తుందని మరోసారి హెచ్చరించాడు. ఆ ఆఫీసరు

ఇక నా ప్రయాణం తప్పేట్టుగా లేదు.ఇంకో రోజు వుండి వెళ్ళాలన్నా కుదరదు. ఉంటే ఆర్థికంగా 'బిల్' యింకో నూటయాభైకు పెరుగుతుంది... ఎవడబ్బ సొమ్మని.. రేపు ఆఫీసు టూర్ రిపోర్టులో ఏమని

రాయాలి! పోనీ వుంటే ఏమి చేయాలి? ఆ ఐదొందలు శంకర్రావు యివ్వకపోతే ఈపాటికి హాయిగా 'రూం' వెకేట్ చేసేవాణ్ణి.. ఎంతటి ఊబిలో పడేశాడు శంకర్రావు! మానసికంగా ఎంత బాధ పెడ్తున్నాడు.

లాస్ట్ ఛాన్స్! శంకర్రావుకు ఫోన్! బయటికి వెళ్ళినవాడు యింకా రాలేదని.. వచ్చే అవకాశం కూడా లేదని విసుగ్గా ఫోన్ పెట్టేశారు అవతలివాళ్ళు... అంతా అయిపోయింది. శంకర్రావు మీద ఆశపోయింది. సామాన్లుకూడా సర్దేశాను. మరిప్పుడెలా? 'రూం' లో కూర్చోవటానికి మనసొప్పడంలేదు. రూం ఖాళీచేసే సమయం దగ్గర పడుతోంది.. అదో 'నెర్వస్'గా వుంది. కిందకు వచ్చాను. నాలుగున్నర అయింది. ఇంకెంతో టైం లేదు.

ఆటో తీసుకుని ఎర్రమంజిల్ కాలనీలో వున్న కృష్ణారావు కోసం వెళ్ళాను... 'క్వార్టర్స్'కు తాళం స్వంత ఇల్లు అమీర్‌పేటలో కట్టుకున్నారని.. ఓ పదిరోజుల క్రిందటే ఆ ఇంటికి మారారని కావాలంటే అమీర్‌పేట అడ్రస్సు ఇస్తామన్నారు ప్రక్కింటివాళ్ళు. అడ్రస్సు తీసుకున్నాను. అమీర్‌పేట వైపు ఆటో తిరిగింది. ఎప్పుడూలేనిది ఒక్క డబ్బుకోసమే వెళ్ళాలంటే మనసు వెనక్కు లాగుతున్నా, ఆటో మాత్రం నేను చెప్పిన అడ్రసుదగ్గర సునాయాసంగా ఆగింది.

కొత్తయిల్లు. అయినా గేటుకు తాళం.. 'కాంపౌండ్‌వాల్'కు ఆనుకునే చిన్న బడ్డీకొట్టు. కృష్ణారావు గురించి వాకబు చేశాను. ఈ రోజు ఉదయమే కృష్ణాలో విజయవాడకెళ్ళారట. అక్కణ్ణుంచి తిరుపతికెళ్తారట. అక్కణ్ణుంచి మంత్రాలయం.... ఎవడికికావాలి ఈ వివరాలన్నీ! విసుగ్గా వుంది. ఆటో ఎక్కాను. ఓసారి శంకర్రావు యింటికి వెళ్తే!... ఇంట్లో వివరాలేమైనా తెలుస్తాయేమోనని వస్తే నాకివ్వమని వాళ్ళావిడకు డబ్బుగాని ఇచ్చివెళ్ళాడేమో శంకర్రావు.. ఎందుకైనా మంచిది! విజయనగర్‌కాలనీ వైపు బంజారాహిల్స్ ద్వారా వెళ్ళమన్నాను ఆటోను. శంకర్రావు ఎదురుపడితే ఎడాపెడా వాయించేయాలని వుంది. ఎంత 'టెన్షన్'

"రాండి ! అన్నయ్యగారూ! వదిన.. పిల్లలు కులాసేనాండీ!" అంటూ సాగదీస్తోంది శంకర్రావు భార్య నన్ను ఆహ్వానిస్తూనే..

"శంకర్రావు లేడటమ్మా!"

"ఆఫీసులో రోజా హెవీ వర్కట అన్నయ్యగారూ! రాత్రి పదిగంటలకుగానీ రారు..."

"నేనెళ్తున్నానమ్మా! నేవచ్చానని చెప్పు. వీలుంటే రూంకు రమ్మని"

అలాగే అన్నయ్యగారూ! అదేంటి అలా వెళ్ళిపోతున్నారు. కాఫీయైనా పుచ్చుకోకుండా?.."

వద్దమ్మా ఇంకోసారి... ఆటోలో కూలబడ్డాను.

హోటల్ చేరుకునేసరికి సరిగ్గా ఐదయింది. ఓ పన్నెండు రూపాయలు ఆటో మూలంగా ఖర్చు..

కౌంటర్లో...!

"నా కోసం ఎవరైనా వచ్చివెళ్ళారా"

"మీ కోసం ఎవరో వచ్చారు... ఇక్కడే వుండాలి... మీ ఆఫీసువాళ్ళు కవరు పంపించారు.. మీకు ఇవ్వమన్నారు. అంటూ ఓ కవర్ని అందించింది రిసెప్షనిస్ట్...

అయితే శంకర్రావే వచ్చిండాలి.. కారిడార్లో నిలబడి చూశాను

సీతాపతి.. జిడ్డువెధవ. నాతోబాటు రూంకు వచ్చాడు.

నాకు చిరాగ్గా వుంది. రిజర్వేషన్ చేసుకున్న టికెట్టు క్యాన్సిల్' చేసి ఈ రాత్రి పదిగంటల బస్సుకు వెళ్తే!" అంతవరకూ ఎక్కడుండాలి. నేను హోటల్లో—

"చెక్ ఇన్ టైం" మధ్యాహ్నం నాల్గుగంటలు.. ఏదో ఒక గంట. రెండు గంటలు 'రూం'లో వుండొచ్చుగాని ఓ నాల్గుగంటలు రూంలో వుంటానంటే హోటల్‌వాళ్ళు 'పర్మిషన్' యిస్తారా? పోనీ రాత్రి పదిగంటల లోపుగా డబ్బు సంపాదిస్తానని నమ్మకం ఏమిటి! పిచ్చి పిచ్చిగా వుంది నా బుర్రంతా!...

రూం కిటికీల్లోంచి కారిడార్ బాగా కనపడుతూంది. తొంగి తొంగి చూస్తున్నాను...

"ఏదో ఆలోచిస్తున్నాను...?"

ఏం ఆలోచిస్తే? ఈ సీతాపతిగాడికెందుకు

"మా ఫ్రెండొకడు రావాలి.."

"అదేంటి సామాన్లు సర్దేశారు.. ఎప్పుడేంటి ప్రయాణం?"

"ఇప్పుడే! కాఫీ తెప్పించమంటారా!" వచ్చిన గెస్టుకు అంతమాత్రం 'ఆఫర్' చేయకపోతే ఏం బావుంటుంది?

బెల్ నొక్కాను. బాయ్ వచ్చాడు. సీతాపతే ఏదో 'ఆర్డర్' చెప్పాడు. నా చూపంతా మనసంతా కారిడార్‌వైపే... శంకర్రావేమైనా 'లాస్ట్ మినిట్'లో వస్తాడేమోనని...

రెండు నిముషాల్లో రెండుప్లేట్లు గారెలు, రెండు కాఫీలు వచ్చాయి. తిండిమీద నాకుధ్యాస లేదు. సీతాపతినే తీసుకోమన్నాను. రెండు ప్లేట్లు గారెలు, రెండు కాఫీలు పుచ్చుకుని 'బ్రేవ్'మన్నాడు సీతాపతి ఎలాంటి మొహమాటం లేకుండానే!.. అందుకనే ఈ సీతాపతి అంటే అసహ్యం... తిండికి మరీ కక్కుర్తి వెధవలా! నాసీ చూసుకున్నాను. ఐదున్నర అయింది.... ఇక రూం ఖాళీ చేయలేదు. అశక్తుణ్ణి.. ఇక రేపే ప్రయాణం. ఓరే! శంకర్రావు!! నీవు ఎదురుగా వుంటే పొడిచిపారేద్దును. వెధవ. ఎంత మోసం చేసావు! ఛీ! ఛీ!!...

నాలో నేనే ఏదో సణుక్కుంటున్నాను...

"బస్సు ఎన్నిగంటలకండీ!" అంటూ సీతాపతి...

నీకెందుకు అప్రాచ్యపు వెధవా!

"ఆరుగంటలకండీ!" అని బదులిచ్చాను.

"మరి టైమైంది బయల్దేరండి.."

వీడికెందుకు!ఊరికే వచ్చిందని గతికావుగా! ఇంకా కావాలా!

"మా ఫ్రెండొకడు మొన్న నా దగ్గర డబ్బుతీసుకెళ్ళాడండీ! ఈరోజుతెచ్చి యిస్తానన్నాడు. ఇంతవరకూ రాలేదు..." రూం ఖాళీ చేయాలండీ నా దగ్గర డబ్బులేదు నిజం చెప్పేశాను కొంత 'ఈజ్' అయ్యేందుకు. అంటూ నా సమస్యను వీడు తీర్చేవాడా! ఆర్చేవాడా?

"అయ్యయ్యో! అలాగటండీ"

బోడి జాలి ఎవడిక్కావాలి. నా బుర్రకు మరీ వేడెక్కిస్తున్నాడు.

మీరేం వర్రీ కాకండి మాస్టారూ! నాదగ్గర డబ్బుంది. రూం బిల్ సెటిల్‌చేయండి" అంటూ సీతాపతి బాయ్‌కోసం బెల్ నొక్కాడు.. పర్సులోంచి ఓ ఐదొందలు తీసి నాకిచ్చాడు.. నిశ్చేష్టుణ్ణయిపోయి నోటమాటరాక యాంత్రికంగా ఆ డబ్బు అందుకున్నాను. రూం బిల్ 'పే' చేశాను. భాయిస్‌కు 'టిప్స్' కింద ఓ పదిహేనిచ్చాను. సీతాపతి చెయ్యి నొక్కాను కృతజ్ఞతగా.. వారం రోజుల్లో డబ్బు పంపుతానన్నాను... "మీ ఇష్టం" అన్నాడు సీతాపతి.

ఆటోలో నా సామాన్లు పెట్టాడు బాయ్..

ఆటో స్టార్ట్ కాబోతోంది. సార్! సార్!! అంటూ బాయ్ పరుగెత్తుకువచ్చి ఆటోను ఆపాడు. "కౌంటర్లో" పిలుస్తున్నారని చెప్పాడు.. ఆత్రుతగా వెళ్ళాను.

"సారీసార్! ఉదయం మీ స్నేహితుడు వచ్చి మీ పేరుమీదుగా ఐదొందలు డిపాజిట్ చేసి వెళ్ళాడు. అది చూసుకోక 'బిల్' సెటిల్ చేశాం. ఇదుగోండి ఆ ఐదొందలు.. అలాగే మీ పేరుతో ఒక కవర్ని కూడా ఇచ్చివెళ్ళాడు..." అంటూ డబ్బుతోపాటు కవర్ని అందించాడు రిసెప్షనిస్ట్...

ఆ ఐదొందలు తీసి సీతాపతి చేతిలో వుంచాను. చివరిగా సెలవు తీసుకుని ఆటోలో కూర్చున్నాను. నాలో ఏదో బరువు తగ్గినట్లయింది. ఐదుముప్పావయింది. బస్సు దొరుకుతుందో? దొరకదో? శంకర్రావు ఇచ్చి వెళ్ళిన కవర్ని బయటకు విసిరేశాను. అందులో ఏముందో నాకు తెలుసు.. కలవందానికి క్షమించేది అని రాసిండొచ్చు. అంతే! కాని ఈ 'టెన్షన్' కంతా ఎవరు కారణం? ఆలోచించేందుకు బుర్ర ఖాళీలేదు. బస్సు దొరక్కపోతే! ఎలా! మళ్ళీ టెన్షనే!!

*

